

విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్

డాక్యుమెంట్లు భద్రమేనా?

- శిథిలావస్థలో రిజిస్ట్రేషన్ శాఖ భవనాలు
- పట్టించుకోని గత ప్రభుత్వం
- చీపురుపల్లి, బొబ్బిలి, గజపతినగరం, ఎస్.కోట కార్యాలయ భవనాలు దయనీయం



శిథిలావస్థకు చేరిన గజపతినగరం రిజిస్ట్రార్ కార్యాలయం

ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే శాఖల్లో రిజిస్ట్రేషన్ శాఖ ఒకటి. అదే సమయంలో అక్కడి రికార్డులు కూడా అంతే కీలకం. అవి భద్రంగా లేకుంటే భూ లావాదేవీల్లో అనేక తిరకాసులకు అవకాశం ఉంది. రిజిస్టర్డ్ డాక్యుమెంట్‌లు మాయమైతే ఒకరి భూమిని మరెవరో లాక్కునే ప్రమాదం లేకపోలేదు. అందుకనే భూ లావాదేవీల రికార్డులుండే కార్యాలయాల భవనాలు మరింత పటిష్ఠంగా ఉండాలి. అయితే జిల్లాలో ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. పాడుబడిన బంగ్లాల్లా తయారయ్యాయి. పెద్ద తుఫాన్ వస్తే కూలిపోయేలా కనిపిస్తున్నాయి. చీపురుపల్లి, బొబ్బిలి, గజపతినగరం, ఎస్.కోట కార్యాలయాల భవనాల దుస్థితి ఇందుకో ఉదాహరణ.

(విజయనగరం దాసన్నపేట)

రిజిస్ట్రేషన్ శాఖ భవనాల విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. వర్షం వస్తే కారిపోయే దుస్థితి కూడా ఉన్నా పట్టించుకోలేదు. కొన్ని కార్యాలయాల్లో స్లాబు వైపు చూస్తే మీద పడుతుందేమోనన్న భయం కలుగుతుంది. ఈ పరిస్థితిని ఉన్నతాధికారులు గుర్తించినా చర్యలు తీసుకోలేదు. రికార్డుల తనిఖీకి వచ్చినప్పుడు సమస్య గుర్తించి చర్చించడం.. ఫైల్ పెడతామని చెప్పడం.. ఆ తర్వాత విస్మరించడం సర్వసాధారణంగా మారింది. ఎన్నాళ్లయినా పక్కా భవనాలకు మోక్షం కలగడం లేదు. రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ఏటా ప్రభుత్వ ఖజానాకు కోట్లాది రూపాయల ఆదాయం సమకూరుతోంది. జిల్లాలో 11 రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ఆరు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. విజయనగరం ఈస్ట్, వెస్ట్, నెల్లిమర్ల, తెర్లాం, భోగాపురం, కొత్తవలస కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉన్నాయి. బొబ్బిలి, చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట, రాజాం రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు సొంత భవనాలున్నాయి. వీటిలో రాజాం కార్యాలయం మాత్రమే కొత్తది. ఇక్కడ దస్త్రాలను భద్రపరిచేందుకు ఎటువంటి ఇబ్బంది లేదు. మిగతావన్నీ శిథిలావస్థకు చేరిన భవనాలే.

- విజయనగరం ఈస్ట్ రిజిస్ట్రార్ కార్యాలయం సబ్ జైలు రోడ్డులో ఉండేది. ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో కార్యాలయాన్ని దాదాపు ఏడేళ్ల క్రితమే దాసన్నపేట విద్యుత్ ఉద్యోగుల భవనంలోకి మార్చారు.. అద్దె ప్రాతిపదికన ఏర్పాటు చేశారు.. సబ్‌జైలు రోడ్డులో శిథిలావస్థకు చేరిన రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని అధునాతన సౌకర్యాలతో నిర్మించాలని ఏడేళ్ల క్రితం ప్రతిపాదించారు. నేటికీ పట్టాలెక్కలేదు. గత ప్రభుత్వం కనీసం పరిగణనలోకి తీసుకోలేదు. విజయనగరం వెస్ట్ కార్యాలయం తొలి నుంచి అద్దె భవనంలోనే ఉంది.. నగర జనాభా పెరిగింది.. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చే వారి సంఖ్య కూడా పెరిగింది.. అయినా ఇరుకు గదుల్లోనే ఇక్కడ కార్యాలయం కొనసాగుతోంది.. అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఈ రెండు కార్యాలయాలకు శాశ్వత భవనాలు ఎప్పటికో.
- బొబ్బిలి, చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మించి 60 ఏళ్లు దాటుతోంది. ఏటా కోట్లాది రూపాయల ఆదాయం ఈ నాలుగు కార్యాలయాల నుంచి ప్రభుత్వానికి చేరుతోంది. అయినా కాని ఇక్కడ శిథిలావస్థ భవనాల్లోనే అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. దస్త్రాలకు, ఇతర డాక్యుమెంట్లకు రక్షణ లేని దుస్థితి. వర్షం పడితే నరకయాతనే. భవనాలు ఎప్పుడు కూలుతాయో? అని భయపడేలా ఉన్నాయి. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే వారు సైతం ఈ కార్యాలయాల పట్ల అసహనం వ్యక్తం చేస్తుంటారు. ఉద్యోగులు కూడా ఇబ్బందులు పడుతూనే విధులు నిర్వహిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..

విజయనగరం జిల్లాలోని శిథిలావస్థలో వున్న కార్యాలయ భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలను ఆర్ అండ్ బీ శాఖకు నివేదించాం. ఉన్న స్థలాల్లోనే కొత్తగా కట్టడమా లేదా కొత్తగా తీర్చిదిద్దడమా అనేది ప్రతిపాదనల్లో స్పష్టంగా పేర్కొన్నాం. ఇదే విషయాన్ని కలెక్టర్ అంబేడ్కర్ దృష్టికి కూడా తీసుకువెళ్లాం.

-ఏపీ కుమారి, జిల్లా రిజిస్ట్రార్

గిరిజనులంతా చదువుకోవాలి

- గిరిజన విశ్వవిద్యాలయానికి త్వరలోనే పక్కా భవనాలు
- ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో మంత్రి శ్రీనివాస్

కలెక్టరేట్, ఆగస్టు 9: ప్రతి గిరిజనుడు కనీసం డిగ్రీ చదువుకోవాలని, తద్వారా ఐటీడీఏ సహకారంతో చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గిరిజన విశ్వవిద్యాలయాన్ని పక్కా భవనాలతో త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ముందుగా అడవితల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గిరిజన విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు గిరిజన సంఘ నాయకులు మాట్లాడుతూ తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అనంతరం మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ గిరిజనులంతా బాగా చదువుకోవాలని, వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. సహజ వనరుల సంరక్షణకు గిరిజన తెగలు ఎంతగానో పాటు పడుతున్నాయని చెప్పారు. విద్యా, వైద్యం గిరిజనులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావాల్సి ఉందన్నారు. డీకే పర్తి గిరిజన గ్రామానికి ఫీడర్ అంబులెన్సుల ద్వారా వైద్యం అందిస్తామన్నారు. అలాగే ఆయా గ్రామాలకు రహదారి నిర్మాణానికి, తాటిపూడి రిజర్వాయర్‌లో బోటుషికారు పునరుద్ధరణకు వీలైనంత త్వరగా చర్యలు తీసుకుంటామన్నారు.

విజయనగరంలో గిరిజనుల కోసం స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామన్నారు. అనంతరం కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమానికి కృషి జరుగుతున్నప్పటికీ ఇంకా కొన్ని చోట్ల విద్య, వైద్యం, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. గిరిజనులు ఏ సమస్య చెప్పినా పరిష్కరించేందుకు ఎల్లవ్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని గిరిజన భవనాన్ని వీలైనంత త్వరగా స్వాధీనం చేస్తామన్నారు. ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం కోసం మాన్సాస్ సంస్థ కూడా తనవంతు కృషి చేస్తోందని చెప్పారు. సమావేశంలో జేసీ కార్తీక్, బీసీ సంక్షేమాధికారి సందీప్‌కుమార్, గిరిజన సంక్షేమాధికారి రామానందం, గిరిజన సంఘాల నాయకులు తమ్మి అప్పలరాజు, డివిజి శ్యామ్, ఎ.వెంకటరమణ, బి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



సంప్రదాయ నృత్య ప్రదర్శనలో గిరిజన బాలికలు



కనకమహాలక్ష్మికి పసుపు కొమ్ములతో అలంకరణ

అమ్మవార్లకు శ్రావణ పూజలు

విజయనగరం రూరల్/చీపురుపల్లి, ఆగస్టు 9: శ్రావణమాసం మొదటి శుక్రవారం పురస్కరించుకుని వివిధ అమ్మవార్ల ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈమాసంలో వచ్చే ప్రతి మంగళ, శుక్రవారా లకు ఎంతో ప్రాధాన్యం ఉంది. తొలి శుక్రవారం కావడంతో లలితా సహస్రనామార్చనలు నిర్వహించారు. విజయనగరం, నెల్లిమర్ల, గరివిడి, చీపురుపల్లి, రాజాం, కొత్తవలస, మెరకముడిదాం, గుర్ల, దత్తిరాజేరు, బొండపల్లి ఇలా అన్నింటా దుర్గాదేవి, లక్ష్మీదేవి, కనకమహాలక్ష్మి, సంతోషిమాత, కన్యకాపరమేశ్వరీతో పాటు వివిధ దేవతల ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పిండి వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. విజయనగరంలోని పైడిమాంబ ఆలయంలో ఉదయం లలితా సహస్రనామార్చన జరిగింది.

- చీపురుపల్లి పట్టణంలో కొలువై ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారు శుక్రవారం శ్రావణ శోభతో భక్తులను ఆకట్టుకున్నారు. శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించారు. అనేక మంది భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పైడిమాంబకు శ్రావణ మాస పూజలు

గ్రామానికే వాతావరణ సమాచారం

- రోజువారీగా అందించే ఏర్పాటు
- రైతులకు ఉపయోగం
- త్వరలోనే రాష్ట్రమంతటా అమల్లోకి..



మెంటాడ, ఆగస్టు 9: ఇకపై గ్రామ పంచాయతీ స్థాయిలో రోజువారీ వాతావరణ సూచనలు అందుబాటులోకి రానున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా ఏర్పాట్లు చేస్తోంది. వాస్తవానికి ఈ ఏడాది జనవరిలోనే భారత వాతావరణ విభాగం 'పంచాయత్ మౌసం సేవా' పోర్టల్‌ను ప్రారంభించి దేశవ్యాప్తంగా బ్లాక్ (సమితి) స్థాయిలో వాతావరణ పరిస్థితిని ఎప్పటికప్పుడు అందిస్తోంది. దీన్ని విస్తరించాలని తాజాగా నిర్ణయించింది. కిసాన్ సంచార్ అనే స్వచ్ఛంద సంస్థతో కలసి కేంద్రం ఈ ఏర్పాట్లను ప్రారంభించింది. సుమారు 6లక్షల గ్రామాల్లో రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రయత్నిస్తోంది. ఇది అమల్లోకి వస్తే గ్రామ పంచాయతీ స్థాయిలోనే వాతావరణ సమాచారం రైతులకు అందుబాటులోకి వస్తుంది. దీనివల్ల రైతులు సాగు విషయంలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకునే అవకాశముంటుంది. ఇప్పటివరకు మన రాష్ట్రానికి సంబంధించినంతవరకు మండలస్థాయికే ఈ సేవలు పరిమితమయ్యాయి. గ్రామస్థాయికి అందుబాటులోకి రానందున రైతులకు సాగు విషయంలో కొంత అయోమయ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఎప్పుడు ఏ పంట సాగుచేస్తే బాగుంటుందనే మీమాంస ఉంటోంది. మండల స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు సిబ్బంది నుంచి సరైన సమాచారం అందడం లేదు. దీంతో రైతులు మూస ధోరణిలో సాగు చేస్తూ పంటలు సరిగా కలిసిరాక ఆర్థికంగా నష్టపోతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

- వర్షపాతం నమోదు విషయంలో ఇప్పటికీ అశాస్త్రీయ విధానమే అమల్లో ఉందని, దీన్ని మార్చాలన్న అభిప్రాయం రైతుల నుంచి వ్యక్తమవుతోంది. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాల్లో రైన్ ఫాల్ నమోదు మీటర్లు ఏర్పాటు చేసిన అధికారులు, ఇక్కడ కురిసిన వర్షాన్నే మండలవ్యాప్తంగా కురిసినట్టుగా పరిగణించి నివేదికలు పంపుతున్నారు. దీనివల్ల రైతులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా కరువు మండలాల గుర్తింపు సమయంలో నష్టపోతున్నారు. గ్రామస్థాయిలో వర్షపాతం నమోదుకు ఎన్నో ఏళ్లుగా కసరత్తు చేస్తున్నా అమల్లోకి రాలేదు. ఇకపై ఈ సమస్యకు పరిష్కారం లభించవచ్చు.

రైతులకు ప్రయోజనం

కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో రైతులకు ప్రయోజనం కలుగుతుంది. వాతావరణ పరిస్థితులు క్షేత్రస్థాయిలో అందడం వల్ల సాగు విషయంలో రైతులు సరైన నిర్ణయం తీసుకోవడానికి వీలవుతుంది. నష్టాలను తగ్గించుకోవచ్చు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలకు నష్టం వాటిల్లితే మండలం యూనిట్‌గా తీసుకునేవారు. ఈ విధానం వల్ల చాలామంది రైతులు నష్టపోయారు. ఇకపై ఈ పరిరిస్థితి నుంచి బయటపడే అవకాశం ఉంది.

- రెడ్డి ఆదినారాయణ, రైతు, పిట్టాడ

విధుల్లో అలసత్వాన్ని సహించం

- ఎస్పీ వకుల్‌జిందాల్

విజయనగరం క్రైం, ఆగస్టు 9: పోలీసు అధికారులు, సిబ్బంది విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని ఎస్పీ వకుల్‌జిందాల్ హెచ్చరించారు. జిల్లా పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో శుక్రవారం జరిగిన సెరిమోనియల్ పరేడ్‌కు ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ఏఆర్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ, ఏఆర్, సివిల్ పోలీసు సిబ్బందితో పాటు పోలీసుశాఖలో భాగస్వాములైన హోంగార్డులు విధి నిర్వహణలో ఎంతో క్రమశిక్షణతో బాధ్యతగా వ్యహరించాలన్నారు. మిగిలిన శాఖల ఉద్యోగుల కంటే పోలీసు శాఖ ప్రత్యేకమైనదని, పోలీసు యూనిఫాంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని, విశ్వాసాన్ని నిలబెట్టి.. పోలీసుశాఖ ప్రతిష్ఠను పెంచేలా సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. పోలీసుల కృషి ఫలితంగానే జిల్లాలో నక్సలిజం పూర్తిగా సమసిపోయిందని, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా సమర్థంగా పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆస్మాప రహీన్, ఎంఎం సోల్మాన్, డీఎస్పీ యూనివర్స్ ఆర్ఐలు గోపాలనాయుడు, రమేష్‌కుమార్ పాల్గొన్నారు.



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

తైక్వాండో పోటీలు ప్రారంభం

విజయనగరం రూరల్, ఆగస్టు 9: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు స్థానిక రాజీవ్ క్రీడామైదానంలోని ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. పోటీలను విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ప్రారంభించారు. ఆత్మరక్షణకు తైక్వాండో చాలా అవసరమన్నారు. పోటీల్లో విజయం సాధించడానికి శ్రమించాలని, ఓటమి చెందిన వారు నిరాశ చెందకుండా.. మరోసారి జరిగే పోటీల్లో విజయానికి ఇప్పటి నుంచే కృషి చేయాలన్నారు.

భార్యా బిడ్డలు వదిలి వెళ్లారని..

- మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య
- అమ్మా క్షమించు.. అంటూ సెల్ఫీ వీడియో..

రాజాం రూరల్, ఆగస్టు 9: ఇద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు.. కొన్నాళ్ల పాటు అన్యోన్యంగా జీవితాన్ని వెళ్లదీశారు. వారికి ఇద్దరు ఆడపిల్లలు కూడా ఉన్నారు. ఏమైందో ఏమో కాని తొమ్మిది నెలల క్రితం వారి మధ్య గొడవలు మొదలయ్యాయి. ఆ సమయంలోనే భార్య భర్తను వదిలి ఇద్దరు పిల్లల్ని వెంట బెట్టుకుని ఇల్లు విడిచి వెళ్లిపోయింది. వారి ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోయింది. అత్తవారింట కూడా ఆమె లేకపోవడం.. రోజులు.. వారాలు.. నెలలు గడుస్తున్నా.. భార్య, పిల్లలు రాకపోయేసరికి మానసికంగా కుంగిపోయాడు.. అదే బాధతో ఈనెల 7న గడ్డిమందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. 'అమ్మా.. నన్ను క్షమించు' అంటూ సెల్ఫీ వీడియో తీసుకుని బంధువులకు పంపాడు. అపస్మారక స్థితిలో ఉన్న కొడుకుని చూసిన తల్లి, బంధువులు రాజాం సామాజిక ఆసుపత్రి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గురువారం సాయంత్రం శ్రీకాకుళం ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు. రాజాం మండలం ఇల్లంనాయుడువలసకు చెందిన ఘంటశాల సత్యధర్ (22) విషాదాంతమిది. ఈ ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వివరాలను రాజాం పోలీసులు తెలిపారు.

చీపురుపల్లి మండలం పత్తికాయ పాలవలస గ్రామానికి చెందిన ఘంటశాల సత్యధర్ (22) కొన్నేళ్ల క్రితం రాజాం మండలం ఇల్లంనాయుడు వలస గ్రామానికి వచ్చి స్థిరపడ్డాడు. సుజాత అనే అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరూ ఇళ్లంనాయుడు వలస గ్రామంలోనే జీవించేవారు. అయితే తొమ్మిది నెలల క్రితం సుజాత తన ఇద్దరు పిల్లలతో భర్తను వదిలి వెళ్లిపోవడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈనెల 7న తోటపల్లి కాలువగట్టు సమీపంలో గడ్డిమందు సేవించి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి తల్లి ఘంటశాల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ జనార్ధనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సత్యధర్(ఫైల్)

ఏఐసీటీఈ
ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్

మహిళలను సాంకేతిక విద్యలో ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్' నోటిఫికేషన్ వెలువడింది. 'ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ)' ఏటా దీనిని ఆఫర్ చేస్తోంది. ఈ స్కీమ్ ద్వారా డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో అర్హులైన అమ్మాయిలకు ఆర్థిక సహకారం అందిస్తారు. ఒక కుటుంబం నుంచి ఇద్దరు అమ్మాయిలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలకు మించకూడదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.



తెలుగు రాష్ట్రాల్లో స్కాలర్‌షిప్‌లు

- డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో ఒక్కోదానికి 5,000 చొప్పున దేశవ్యాప్తంగా మొత్తం 10,000 స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా నిర్దేశిత కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి దరఖాస్తు చేసుకొన్న విద్యార్థినులందరికీ స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు.
- డిప్లొమా కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 318, తెలంగాణకు 206 స్కాలర్‌షిప్‌లు కేటాయించారు.
- డిగ్రీ కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 566, తెలంగాణకు 424 స్కాలర్‌షిప్‌లు ప్రత్యేకించారు.

అర్హత వివరాలు

- డిప్లొమా కేటగిరీకి అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరానికి టెక్నికల్ డిప్లొమా లెవెల్ కోర్సుల్లో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- డిగ్రీ కేటగిరీకి దరఖాస్తు చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఏదేని టెక్నికల్ డిగ్రీ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందినవారు కూడా అర్హులే.
- పదోతరగతి/ఇంటర్ పూర్తిచేసిన రెండేళ్లలోపు ఏఐసీటీఈ గుర్తింపు పొందిన సంస్థలో డిప్లొమా/డిగ్రీ ప్రవేశం పొంది ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇతర మెరిట్ స్కాలర్‌షిప్స్ పొందుతున్నవారు, పీఎంఎస్ఎస్ఎస్ స్కీం కింద చదువుకుంటున్నవారు, నాన్ టెక్నికల్ కోర్సుల్లో చేరినవారు, డ్యూయెల్ డిగ్రీ/పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందినవారు, ఇతరత్రా స్టయిపెండ్/ఆదాయం పొందుతున్నవారు దరఖాస్తుకు అనర్హులు.

స్కాలర్‌షిప్

- టెక్నికల్ డిప్లొమా రెగ్యులర్ కోర్సులో చేరినవారికి మూడేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు రెండేళ్లు; టెక్నికల్ డిగ్రీ రెగ్యులర్ కోర్సులో చేరినవారికి నాలుగేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు మూడేళ్లపాటు స్కాలర్‌షిప్ అందిస్తారు. కాలేజ్ ఫీజు, కంప్యూటర్ కొనుగోలు, సాఫ్ట్‌వేర్, స్టేషనరీ, బుక్స్ ఎక్విప్‌మెంట్ తదితరాల నిమిత్తం ఏడాదికి రూ.50,000లు ఇస్తారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) విధానంలో నేరుగా అమ్మాయి బ్యాంక్ ఖాతాకు ఈ మొత్తాన్ని జమ చేస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి/ఇంటర్ సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు; ఆదాయ ధ్రువీకరణ పత్రం; సంబంధిత కోర్సులో అడ్మిషన్ పొందిన లెటర్; ట్యూషన్ ఫీజు రిసీట్; ఆధార్ లింక్‌తో ఉన్న బ్యాంక్ ఖాతా నంబర్; ఐఎఫ్ఎస్‌సీ కోడ్; కుల ధ్రువీకరణ పత్రం; ఆధార్ కార్డ్; అభ్యర్థి ఫొటో
- **ఇన్‌స్టిట్యూట్ వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 15
- **డీఎన్ఓ/ఎస్ఎన్ఓ/ఎంఎన్ఓ వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 30
- **వెబ్‌సైట్:** scholarships.gov.in

దిక్సూచి
DIKSUCHI

జేఎన్‌టీయూహెచ్‌లో స్పాట్ అడ్మిషన్స్



హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూ)కి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ యూనివర్సిటీ ఫారిన్ రిలేషన్స్(డీయూఎఫ్ఆర్)- డిగ్రీ ప్రోగ్రామ్‌లలో విదేశీ కోటా కింద మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో సీట్లు అలాట్ చేస్తారు. ఎఫ్ఎన్/పీఐఓ/సీఐడబ్ల్యూజీ/ఎన్ఆర్ఐ కేటగిరీల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఆసక్తిగలవారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, నిర్దేశిత ఫీజులతో క్యాంపస్‌కు హాజరు కావాలి.

నాలుగేళ్ల బీటెక్ విభాగాలు-సీట్లు

- సీఎస్ఈ-ఏఐఎంఎల్ 6, సీఎస్ఈ-సైబర్ సెక్యూరిటీ 5, ఈసీఈ 4, ఈఈఈ 6, మెకానికల్ 6, సివిల్ 6, కెమికల్ 6, మెటలర్జీ 8, బయోటెక్నాలజీ 6, జియో ఇన్ఫర్మాటిక్స్ 8 సీట్లు చొప్పున మొత్తం 61 సీట్లు ఉన్నాయి.

అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ విభాగాలు-సీట్లు

- సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ విభాగాల్లో ఒక్కోదానిలో 5 సీట్లు చొప్పున మొత్తం 25 సీట్లు ఉన్నాయి.

మూడేళ్ల మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్-సీట్లు

- బీబీఏ ప్రోగ్రామ్‌లో 6 సీట్లు ఉన్నాయి.
- **స్పాట్ అడ్మిషన్స్:** ఆగస్టు 12 నుంచి
- **వేదిక:** డైరెక్టరేట్ ఆఫ్ యూనివర్సిటీ ఫారిన్ రిలేషన్స్, జేఎన్‌టీయూహెచ్, కూకట్‌పల్లి, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

ఫిల్మ్ డైరెక్షన్‌లో ఆన్‌లైన్ కోర్సు

పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌టీఐఐ) ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ ఓపెన్ లెర్నింగ్(సీఎఫ్ఓఎల్)- 'ఫండమెంటల్స్ ఆఫ్ ఫిల్మ్ డైరెక్షన్' కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. మొత్తం 33 సీట్లు ఉన్నాయి.

కోర్సు వివరాలు: కోర్సు వ్యవధి అయిదు రోజులు. ఆగస్టు 26 నుంచి కోర్సు ప్రారంభమౌతుంది. ప్రతి రోజూ ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం పన్నెండున్నర వరకు, మరల మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం నాలుగున్నర వరకు సెషన్స్ ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో తరగతులు నిర్వహించినప్పటికీ హిందీ మాధ్యమంలోనూ వివరణ ఇస్తారు. ఈ కోర్సులో సినిమా, లాంగ్వేజ్ ఆఫ్ సినిమా, స్పేస్ అండ్ టైమ్ ఆఫ్ సినిమా, ఫిల్మ్ ఫోరం, ఫిల్మ్ ఇమేజ్, ఫిల్మ్ సౌండ్, ఎలిమెంట్స్ ఆఫ్ స్టోరీ, స్క్రీన్‌ప్లే, వర్కింగ్ విత్ యాక్టర్స్, రోల్ ఆఫ్ ఫిల్మ్ డైరెక్టర్ తదితర అంశాలు వివరిస్తారు.

అర్హత: పదోతరగతి/పన్నెండో తరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. అభ్యర్థులు కనీసం 4 జీబీ ర్యామ్ గల డెస్క్‌టాప్/ల్యాప్‌టాప్, విండోస్ 7/8/10 ఆపరేటింగ్ సిస్టమ్, ఆడియో-వీడియో సాఫ్ట్‌వేర్, హెడ్‌ఫోన్/ఇయర్‌ఫోన్, హెచ్‌డీ వెబ్ క్యామ్, రోజుకి కనీసం 5 జీబీ ఇంటర్నెట్ ప్యాక్, లేటెస్ట్ వెబ్ బ్రౌజర్ ఏర్పాటు చేసుకోవాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 12
- **వెబ్‌సైట్:** ftii.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/GABEQtfలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



మురారి చూస్తూ మూడుముళ్లు

అభిమాన హీరో సినిమా రిలీజ్ అవుతోందంటే క్షీరాభిషేకాలు, హారతులు, తీన్‌మార్ డప్పుల మోతలతో ఫ్యాన్స్ సందడి చేయడం తెలిసిందే. ఇప్పుడు మహేశ్‌బాబు అభిమానులు మరో అడుగు ముందుకేశారు. శుక్రవారం ఆయన నటించిన 'మురారి' చిత్రం రీ రిలీజ్ అయింది. ఈ సందర్భంగా కొందరు అభిమానులు థియేటర్లలో ప్రేక్షకులకు అక్షింతలు పంచగా, మరికొందరు థియేటర్లలోనే పెళ్లి చేసుకొన్నారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తెలుగు సినిమాల్లో పెళ్లి పాటల ప్రస్తావన తెస్తే అందులో 'మురారి' చిత్రంలోని 'అలనాటి రామచంద్రుడు' గీతం తప్పకుండా ఉంటుంది. అందుకేనేమో 'మురారి' సినిమా రీ రిలీజ్‌ను తమ పెళ్లికి వేదికగా చేసుకున్నారు మహేశ్‌బాబు అభిమానులు. 'అలనాటి రామచంద్రుడు' గీతం తెరపై ప్లే అవుతోన్న సమయంలో తన ప్రియురాలు మెడలో మూడు ముళ్లు వేశాడు ఓ యువకుడు. మరికొన్ని థియేటర్లలో అభిమానులు ప్రేక్షకులకు అక్షింతలు పంచారు. మహేశ్‌బాబు, సోనాలి బింద్రే పెళ్లి సీన్ రాగానే వాటిని తెరపైకి విసురుతూ వారంతా సందడి చేస్తున్న వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. కృష్ణవంశీ దర్శకత్వం వహించిన 'మురారి' చిత్రం 2001లో విడుదలై ఘన విజయం అందుకొంది.

షూటింగ్ షురూ



అభిమానులంతా ఎప్పుడెప్పుడు షూటింగ్ మొదలవుతుందా అని ఎదురుచూస్తున్న క్రేజీ ప్రాజెక్ట్‌లో డైరెక్టర్ ప్రశాంత్ నీల్, జూనియర్ ఎన్టీఆర్ సినిమా ఒకటి. 'ఎన్టీఆర్ నీల్ వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ సినిమాను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్, డైరెక్టర్ నీల్ కుటుంబ సభ్యులతో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేకర్స్ మాట్లాడుతూ "ఈ సినిమాపై ఎన్ని అంచనాలు ఉన్నాయో తెలిసిందే. ఆ అంచనాలను మించి ఈ సినిమా ఉంటుంది. ఓ వైవిధ్యమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది" చెప్పారు. పాన్ ఇండియా ప్రాజెక్టుగా తెరకెక్కనున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న ఈ సినిమా 2026 జనవరి 9న విడుదల కానుంది.



బచ్చన్ అలరిస్తాడు

'మిస్టర్ బచ్చన్' సినిమాతో కథానాయికగా తెలుగుతెరకు పరిచయమౌతున్నారు భాగ్యశ్రీ బోర్సే. ఇప్పటికే రిలీజైన టీజర్, ట్రైలర్‌లో తన అందం, అభినయంతో కుర్రకారు మనసును దోచేసిన ఆమె.. ఈ నెల 15న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు. "ఇందులో నేను పోషించిన పాత్ర పేరు జిక్కీ. సినిమాలో నా పాత్ర చాలా కీలకమైనది. దర్శకుడు హరీశ్ శంకర్ ఈ కథ చెప్పగానే నచ్చేసింది. నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పాను. అంచనాలను మించేలా దర్శకుడు ఈ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. ఇది బాలీవుడ్ సినిమా 'రైడ్'కు రీమేక్‌గా తెరకెక్కినా ఇందులో వినోదం, ప్రేమకథ అదనంగా ఉంటాయి. రవితేజ లాంటి అగ్ర నటుడితో కలసి నటించడం చాలా మధురానుభూతి. మిక్కీ.జే. మేయర్ సంగీతం ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. థియేటర్లో ప్రతి క్షణం ఎంజాయ్ చేసే సినిమా ఇది" అని చెప్పారు.

సూర్యకు స్వల్ప గాయం



తమిళ హీరో సూర్య స్వల్పంగా గాయపడ్డారు. ఆయన తాజాగా నటిస్తున్న చిత్రం షూటింగ్‌లో ఈ ప్రమాదం జరిగింది. అభిమానులు ఆందోళన చెందడంతో సూర్య స్నేహితుడు, సహ నిర్మాత రాజశేఖర్ పాండ్యన్ తన ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. 'ప్రియమైన అభిమానులారా.. ఇది కేవలం చిన్న గాయం మాత్రమే. దయచేసి ఎవరూ ఆందోళన చెందకండి. మీ అందరి ఆదరాభిమానాలు, ప్రేమ, ప్రార్థనలతో సూర్య బాగానే ఉన్నారు' అని పేర్కొన్నారు. కాగా, 'కంగువా' సినిమా తర్వాత కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో 'సూర్య44' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ కొత్త చిత్రం తెరకెక్కుతోంది. ఊటీలో రెండో షెడ్యూల్ షూటింగ్ జూలై 26 నుంచి శరవేగంగా సాగుతోంది. ఇందులో భాగంగా 'నవానగర్ ప్యాలెస్'లో జూనియర్ ఫైటర్లతో కలిసి పోరాట సన్నివేశాన్ని చిత్రీకరిస్తుండగా, సూర్య తలకు స్వల్ప గాయమైంది. ఆ వెంటనే ఆయన్ని సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్ళి చికిత్స అందించారు. ఈ ఘటన కారణంగా షూటింగ్ నిలిపివేశారు. చికిత్స అనంతరం సూర్య మళ్ళీ లొకేషన్‌కు వచ్చి షూటింగ్‌లో పాల్గొన్నారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

కీలక షెడ్యూల్‌లో...



తమిళ స్టార్ హీరో అజిత్‌కుమార్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. తెలుగు-తమిళ భాషల్లో తెరకెక్కుతున్న ఈ బైలింగువల్ చిత్రానికి 'మార్క్ ఆంటోని' ఫేమ్ అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ఫస్ట్ లుక్ అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన కీలక షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతోంది. సంక్రాంతి కానుకగా 2025లో చిత్రం విడుదలవుతోంది.

కొత్తగా...

నిరీక్షణకు తెర



'కేజీఎఫ్' తర్వాత యశ్ ఏ సినిమా చేస్తారా అని ఎదురుచూస్తున్న అభిమానుల నిరీక్షణకు తెర పడింది. ఆయన హీరోగా నటించే పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్.. ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' చిత్రం షూటింగ్ బెంగళూరులో పూజా కార్యక్రమాలతో మొదలైంది. యశ్ పుట్టిన రోజున ప్రారంభమైన ఈ చిత్రానికి గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. పవర్‌ఫుల్ కథతో, ఎమోషనల్ సీన్స్‌తో విజువల్‌గా ఉన్నతంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తామని నిర్మాత వెంకట్ కె నారాయణ చెప్పారు.

నిర్మాతగా మారిన దర్శకుడు



సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిశోర్ నిర్మించే 'తల్లి మనసు' చిత్రం షూటింగ్ శుక్రవారం ఉదయం అన్నపూర్ణ స్టూడియోలో మొదలైంది. ముహూర్తపు షాట్‌కు ఏషియన్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ భరత్ నారంగ్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, సీనియర్ నిర్మాత పోకూరి బాబూరావు తొలి క్లాప్ ఇచ్చారు. 'టైటిల్‌ను బట్టి చూస్తేనే ఇది ఎంత మంచి సబ్జెక్టో మీకు అర్థమవుతుంది' అన్నారు ముత్యాల సుబ్బయ్య. ఓ మధ్యతరగతి తల్లి చుట్టూ తిరిగే కుటుంబ కథా చిత్రమిదని దర్శకుడు శ్రీనివాస్ చెప్పారు.

ఎన్టీఆర్ మునిమనవడితో



నందమూరి హరికృష్ణ, బాలకృష్ణలతో సినిమాలు రూపొందించిన దర్శకుడు, సీనియర్ ఎన్టీఆర్ వీరాభిమాని అయిన వై.వి.ఎస్. చౌదరి తాజాగా ఓ చిత్రాన్ని రూపొందించనున్నారు. న్యూ టాలెంట్ రోర్స్ (ఎన్.టి.ఆర్.)పతాకంపై ఆయన సతీమణి గీత ఈ సినిమాను నిర్మించనున్నారు. సీనియర్ ఎన్టీఆర్ ముని మనవడు, హరికృష్ణ మనవడు నందమూరి తారక రామారావు ఈ చిత్రంతో హీరోగా పరిచయమవుతున్నారు. అలాగే తెలుగు అమ్మాయి వీణా రావుని హీరోయిన్‌గా పరిచయం చేస్తున్నట్లు శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వై.వి.ఎస్. చౌదరి చెప్పారు.

'డీల్' కుదిరిందా?



హీరో హను కోట్ల స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'డీల్'. పద్మారమా కాంతారావు, కొల్ని రామకృష్ణ నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హను కోట్ల మాట్లాడుతూ "ఇదో డిఫరెంట్ కథతో వస్తున్న సినిమా. సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా అందరినీ అలరిస్తుంది" అని తెలిపారు.

కర్ణాటక నాటక అకాడమీ పురస్కారాన్ని తిరస్కరించిన ప్రకాశ్‌రాజ్



కర్ణాటక నాటక అకాడమీ వార్షిక పురస్కారాన్ని విలక్షణ నటుడు ప్రకాశ్‌రాజ్ తిరస్కరించారు. ఈ మేరకు 'ఎక్స్'లో శుక్రవారం పోస్ట్ చేశారు. అభిమానులు, అకాడమీని క్షమాపణలు కోరారు. పురస్కారాన్ని తీసుకునేందుకు తన మనస్సాక్షి అంగీకరించడం లేదని, క్షమించాలని అన్నారు. ఇప్పుడిప్పుడే నాటకరంగంవైపు వెనుతిరిగానని, చేయాల్సిన పనులు ఎక్కువే ఉన్నాయని పేర్కొన్నారు. తనకంటే ఎంతో మంది అర్హులు రంగస్థలంలో ఉన్నారని, అందుకే తన మనస్సాక్షి అంగీకరించడం లేదని, పురస్కారాన్ని తిరస్కరించానని తెలిపారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

సుప్రీం కోర్టులో లాపతా లేడీస్ ప్రదర్శన

బాలీవుడ్ చిత్రం 'లాపతా లేడీస్'కు అరుదైన గౌరవం దక్కింది. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు చరిత్రలో తొలిసారి ప్రదర్శించిన సినిమాగా చరిత్ర సృష్టించింది. సుప్రీం కోర్టు వజ్రోత్సవాలను పురస్కరించుకొని 'లాపతా లేడీస్'ను శుక్రవారం సాయంత్రం కోర్టు ఆడిటోరియంలో ప్రత్యేకంగా ప్రదర్శించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో పాటు ఇతర న్యాయమూర్తులు, న్యాయస్థానం సిబ్బంది వారి కుటుంబ సభ్యులతో కలసి ఈ చిత్రాన్ని వీక్షించారు. తన సొంత ప్రొడక్షన్‌లో ఆమిర్‌ఖాన్ ఈ చిత్రాన్ని నిర్మించగా, ఆయన మాజీ భార్య కిరణ్‌రావు దర్శకత్వం వహించారు. వారిద్దరూ ఈ ప్రదర్శనకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. లింగ సమానత్వం నేపథ్యంలో తెరకెక్కిన 'లాపతా లేడీస్' చిత్రం ఈ ఏడాది మార్చిలో విడుదలైంది. కమర్షియల్‌గా విజయం సాధించకపోయినా, విమర్శకుల ప్రశంసలతో పాటు పలు పురస్కారాలు అందుకుంది.


నేనా.. సింగిలా..!



కీర్తి సురేశ్ నటించిన తమిళ చిత్రం 'రఘుతాత'. ఈ నెల 15న సినిమా విడుదలవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో ఉన్న ఆమె.. ఓ పాడ్‌కాస్ట్‌లో ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. "ప్రస్తుతం నా కెరీర్‌ను ఎంతో బాగా ఆస్వాదిస్తున్నాను. నా దృష్టిలో పెళ్లి అంటే ఇద్దరు వ్యక్తులు ఒకరికొకరు గౌరవం ఇచ్చుకుంటూ జీవితాంతం కొనసాగడమే" అని పేర్కొన్నారు. ఓ విలేఖరి మీరు సింగిలా అని ఆమెని అడగ్గా.. "నేను మీకెప్పుడు సింగిల్ అని చెప్పలేదు కదా" అని బదులిచ్చారు. దీంతో ఆమె రిలేషన్‌షిప్‌లో ఉన్నారంటూ వస్తున్న వార్తలు నిజమేనేమో అని అభిమానులు భావిస్తున్నారు.

దుబాయ్‌లో అమ్మేస్తాడేమో...

తాప్సీ పన్ను నటించిన 'ఖేల్ ఖేల్ మే' ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె మీడియాతో ముచ్చటించి ఓ ఆసక్తికర విషయాన్ని తెలియజేశారు. "నేను, నా భర్త మథియస్ బో 2013లో మొదటిసారి కలుసుకున్నాం. మొదటి సారి తనతో డేటింగ్‌కు వెళ్లాల్సినప్పుడు నన్ను దుబాయ్ రమ్మని మథియస్ ఆహ్వానించాడు. ఆ విషయం నా మిత్రురాలికి చెబితే.. జాగ్రత.. ఆయన నిన్ను దుబాయ్‌లో అమ్మేస్తాడేమో.. ఎందుకైనా మంచిది.. మా అక్క నంబర్ తీసుకో" అని ఓ స్నేహితురాలు చెప్పిన విషయాన్ని ఆమె గుర్తుచేసుకున్నారు.



ప్రేమకథను ప్రశంసిస్తున్నారు



విజయ్‌శంకర్ హీరోగా నటించిన 'పాగల్ వర్సెస్ కాదల్' చిత్రం శుక్రవారం సినిమా విడుదలై మంచి టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ "డైరెక్టర్ ఈ కథ చెప్పినప్పుడు చాలా కొత్తగా అనిపించింది. కథకు అందరూ కనెక్ట్ అయ్యారు. ప్రేమకథ కొత్తగా ఉందని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. ఈ సినిమా విజయం సాధించడంతో ఎంతో ఆనందంగా ఉంది. యూత్, ఫ్యామిలీ.. ఇలా అన్ని వర్గాలకు చెందిన ప్రేక్షకులు సినిమాను ఆదరిస్తున్నారు" అని చెప్పారు.

ప్రణయ గాథ



ఎస్.ఎస్. సైదులు, భ్రమరాంబిక, అర్పిత లోహి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం '1980ల రాధేకృష్ణ'. ఇస్మాయిల్ షేక్ దర్శకత్వంలో ఊడుగు సుధాకర్ నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు ఇస్మాయిల్ షేక్ మాట్లాడుతూ "ఇదో అద్భుతమైన ప్రేమ కథ. ఈ సినిమా ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుంది" అని చెప్పారు.

www.andhrajyothy.com విజయనగరం/పార్వతీపురం జిల్లా వార్తలు శనివారం 10 ఆగస్టు 2024 7

స్థలం మాది.. పేరు విశాఖదా?

● ఎయిర్‌పోర్టు ప్రహరీపై ముద్రించిన పేరుపై భోగాపురం వాసుల మనోవేదన ● మార్చాలని డిమాండ్



భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రహరీ, (ఇన్‌సెట్‌లో) గోడపై విశాఖ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుగా ముద్రించిన దృశ్యం

భోగాపురం, ఆగస్టు 9: అంతర్జాతీయ ఎయిర్‌పోర్టును భోగాపురంలో నిర్మిస్తుంటే విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు అని గోడపై ఎలా ముద్రిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పేరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిర్వాసిత గ్రామాల్లో ఈ విషయం తరచూ చర్చనీయాంశమవుతోంది. నేతల దృష్టికి కూడా వెళ్లింది.

భోగాపురంలో అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు కోసం స్థానిక రైతులు సుమారు 2700 ఎకరాలు ఇచ్చారు. నాలుగు గ్రామాలు ఎయిర్‌పోర్టులో కనుమరుగయ్యాయి. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి భవిష్యత్ తరాల కోసం వారంతా భూములు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. కాగా ఎయిర్‌పోర్టు నిర్మాణం ప్రారంభం కాకముందు నుంచి అన్ని సందర్భాల్లోనూ భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు అనే పిలుస్తూ వస్తున్నారు. అధికారులు, నాయకులు కూడా అలాగే చెబుతున్నారు. మరి ప్రహరీపై మాత్రం పేరు మార్చారు. విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు అని పలుచోట్ల ముద్రించారు. దీనినే స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. ఇలా ఎలా పేరు పెడతారని ప్రశ్నిస్తున్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ముందే ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. ఆ పనులు 50శాతంపైగా పూర్తి కావొచ్చాయి. ప్రహరీపై ఎక్కడ చూసినా విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు అని ఉంది. ఇది స్థానికుల మనోభావాలను దెబ్బతీస్తోంది. మండలంలోని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారు.

ఎయిర్‌పోర్టు కోసం భూములు కోల్పోవడమే కాకుండా పూర్వ నుంచి జీవిస్తున్న స్థలాలను కూడా వదులుకొన్నామని, కనీసం భోగాపురం ఎయిర్‌పోర్టు అని ఎక్కడా లేకపోవడం దారుణమని స్థానికులు అనుకొంటున్నారు. ఎయిర్‌పోర్టు పేరు పక్కన భోగాపురం పేరు ఉండేలా చూడాలని కోరుతున్నారు. దీనిపై జీఎంఆర్ సంస్థ వారిని వివరణ కోరగా ఇది ఎయిర్‌పోర్టు పేరు కాదని ఎయిర్‌పోర్టును నిర్మిస్తున్న జీఎంఆర్‌కి సంబంధించిన పేరు అని కొట్టిపారేస్తున్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

రామభద్రపురం: మండలంలోని చెదరడవలసకు చెందిన ఓ బాలిక శుక్రవారం చికిత్సపొందుతూ మృతిచెందింది.ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ కథనం మేరకు... చెదరడవలసకు చెందిన నీలాద్రి గౌరమ్మకు (16)తండ్రి మందలించడంతో ఈనెల ఏడోతేదీ ఉదయం గడ్డిమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో 108లో బాడంగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరం తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందింది.ఆమె తండ్రి నీలాద్రిపొట్టన్నదొర ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేశారు. గౌరమ్మ తొమ్మిదో తరగతితో చదువు మానేసింది.

ఏవోబీలో గుర్తు తెలియని మృతదేహం

సాలూరు రూరల్: ఏవోబీలో కొఠియాగ్రూపు గ్రామం మూలతాడివలస సమీపంలో ప్రవహిస్తున్న గంజాయిభద్రగెడ్డ (చిట్టిగెడ్డ)లో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం కనిపించింది.ఈ విషయమై సమాచారం అందుకున్న సాలూరు రూరల్ ఎస్ఐ ఎం.వెంకటరమణ హుటాహుటిన అక్కడకు వెళ్లారు. మృతుడు 35 ఏళ్ల వయస్సు వ్యక్తిగా గుర్తించామని చెప్పారు. మరణించి సుమారు 15 రోజులు కావడంతో మృతదేహం ఛిద్రమై ఉందన్నారు. ముఖం గుర్తుపట్టలేని విధంగా తయారయ్యిందన్నారు. కేవలం పుర్రెమాత్రం ఉందని చెప్పారు. మృతదేహానికి అక్కడికక్కడే శవపరీక్షలు నిర్వహించారు.సాలూరుసర్కిల్ పరిధిలో ఇటీవల మిస్సింగ్ కేసులు నమోదు కాలేదని, మృతుడి ఆచూకీకోసం ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు.

గంజాయి కేసులో నలుగురి అరెస్టు

భోగాపురం: గంజాయి కేసులో నలుగురిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించినట్లు సీఐ ఎ.రవికుమార్ శుక్రవారం తెలిపారు. భోగాపురం గ్రామానికి చెందిన ఓదూరు సాయివరప్రసాదు, అడ్డగర్ల దేవేంద్రకుమార్, మరాడ వెంకటేష్, కొల్లి సాయి నలుగురు వ్యక్తులు గంజాయి సేవిస్తుండడంతో అరెస్టుచేసి, కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు.పూర్తిగా విచారించి వారిని కోర్టుకు తరలిస్తామని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా గంజాయి ఉన్నా, సేవిస్తున్నా ప్రజలు బాధ్యతగా వ్యవహరించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

బసవపాలెం సమీపంలో పేకాటరాయుళ్లు..

భోగాపురం: మండలంలోని బసవపాలెం సమీపంలో పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకుని, అరెస్టు చేశామని సీఐ ఎ.రవికుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక విలేకర్లకు తెలిపిన వివరాల ప్రకారం.. బసవపాలెం సమీపంలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్టు సమాచారం రావడంతో టాస్‌పోర్సు బృందం ఘటనా స్థలానికి చేరుకుని, దాడి చేశారు. పేకాట ఆడుతున్న 11మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనుంచి రూ.లక్షా 26వేల 500 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పోలీసులకు అప్పగించారు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

అర్హులందరికీ పథకాలు అందాలి

● సీనియర్ న్యాయాధికారి వివేక్ ఆనంద్ శ్రీనివాస్

రాజాం రూరల్: అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలుఅందాలని, ఇందు కోసం వివిధస్థాయిల్లో పనిచేస్తున్న ప్రభుత్వోద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు, సీనియర్ న్యాయాధికారి వివేక్‌ఆనంద్ శ్రీనివాస్ తెలిపారు.శుక్రవారం రాజాం మండలపరిషత్ కార్యాలయంలో న్యాయఅవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వితంతు వులు ప్రభుత్వపథకాలు పొందడంలో అవసరమైన సహాయం కోసం మండల న్యాయసేవాసంఘం పనిచేస్తోందని, సంఘసేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.జూనియర్ న్యాయాధికారి కృష్ణ సాయి తేజ యువత మత్తుపదార్థాలకు దూరంగాఉండాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయాల ఉద్యోగులు, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

హోరాహోరీగా అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు

విజయనగరం టౌన్: విజయనగరంలోని సర్‌విజ్జీ మైదానం, పీవీజీ రాజు నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ మైదానంలో సీనియర్ పురుషుల అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు హోరా హోరీగా సాగుతున్నాయి. సర్‌విజ్జీ మైదానంలో తూర్పుగోదావరి-విజయనగరం జిల్లా జట్ల మధ్య శుక్రవారం ప్రారంభమైన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో తూర్పుగోదావరి జట్టు 70.2 ఓవర్లలో 250 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఆ జట్టులో ఏవీవీ విజయ్, పి.పాండురంగా అర్థసెంచరీలు సాధించారు. విజయనగరం జట్టులో బౌలర్లు సమిష్టిగా రాణించి తూర్పుగోదావరిజట్టు బ్యాట్స్‌మెన్లను కట్టడి చేశారు. పి.తేజస్వీ 18 ఓవర్లలో 43 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన విజయనగరం జట్టు ఆట ముగిసే సమయానికి 17 ఓవర్లలో ఒక్క వికెట్ నష్టపోయి 58 పరుగులు చేసింది. కెప్టెన్ పి.తపస్వీ 30 పరుగులు, ఎస్.హరీష్ 18 పరుగులతో నాటౌట్‌గా ఉన్నారు. కాగా పీవీజీరాజు నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ మైదానంలో విశాఖపట్నం, శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో విశాఖ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ఆ జట్టు బ్యాట్స్‌మెన్లు సమిష్టిగా రాణించి 69.2 ఓవర్లలో 330 పరుగులు సాధించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు 14 ఓవర్లలో వికెట్ నష్టపోయి 34 పరుగులు చేసింది.

ఎరువుల కోసం రైతుల నిరసన

వేపాడ: కొండగంగుబూడి రైతులు ఏపీ రైతు సంఘం నాయకుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో ఎరువులకోసం ఆర్బీకే వద్ద శుక్రవారం నిరసనతెలిపారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ ఆర్బీకేకు ఎరువులు వచ్చి మూడురోజులు గడుస్తున్నా అందజేయకుండా సిబ్బంది తప్పించుకుని తిరుగుతున్నారని ఆరోపించారు.

క్విట్ కార్పొరేట్ నిరసన ర్యాలీ

బొబ్బిలి: బొబ్బిలిలో కళాసీ సంఘం ఆధ్వర్యంలో సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుమేరకు శుక్రవారం క్విట్ కార్పొరేట్ కార్యక్రమంలో భాగంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి, పట్టణ కళాసీ సంఘం కార్యదర్శి దంతులూరి వర్మ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఈ సంద ర్భంగా ఎన్టీఆర్ కూడలిలో వర్మ మాట్లాడుతూ వ్యవసాయరంగం, రిటైల్ వ్యాపా ర రంగంలోకి బడాకార్పొరేట్ కంపెనీలు చొరబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్య క్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పీడిక అసిరియ్య, రైతుకూలీ సంఘం నాయకులు ప్రసాద్, సూరిబాబు, రాజు, బోగాది అప్పలస్వామి, అప్పారావు, రామకృష్ణ, కళాసీలు, గిరిజనులు పాల్గొన్నారు.

●**శృంగవరపుకోట:** కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం శృంగవరపుకోట ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సీపీఎం ఆందోళనకు దిగింది. కార్పొరేట్ కంపెనీలను బహిష్కరించాలని కోరుతూ క్విట్ కార్పొరేట్ అంటూ నినాదాలు చేశారు. రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్ల జగన్, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు, జిల్లా కార్యదర్శి మద్దిల రమణ పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ పునరుద్ధరించాలి: కలెక్టర్

కలెక్టరేట్: ద్వారపూడి గ్రామం పరిధిలోగల జేఎన్‌టీయూ వద్ద కొండపై ఉన్న సోలార్ ప్లాంట్‌ను 15 రోజుల్లో పునరుద్ధరించాలని కలెక్టర్ అంబేడ్కర్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సోలార్ ప్లాంట్ పరిస్థితిపై కలెక్టరు ఆరా తీశారు. నెడ్‌కాప్ ఆధ్వర్యంలో రూ.4.8 కోట్లతో 2017లో ప్లాంట్ ఏర్పాటు చేశారని, పదేళ్ల వరకూ కాంట్రాక్టరు నిర్వహణ చూడాల్సి ఉందని మునిసిపల్‌కమిషనర్ మల్లయ్యానాయుడు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం ప్యానెల్స్ అన్ని పాడవడంతో వాటిని పునరుద్ధరించడానికి కనీశం రూ.రెండు కోట్లు ఖర్చవుతుందని నెడ్‌కాప్ అధికారులు కలెక్టర్‌కు తెలియజేశారు. ప్లాంట్‌ను నిర్లక్ష్యం గా వదిలివేయడంతోనే నష్టంజరిగిందని కాంట్రాక్టర్, నెడ్‌కాప్ అధికారులకు నోటీసు లు జారీచేసి, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఈఈ శ్రీనివాసరావు, నెట్ కాప్ అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు కర్మాగారాల్లో తనిఖీ నివేదిక

జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో స్థానిక ఉద్యోగాల నిబంధనలు మేరకు 75 శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. గత వారం జరిగిన సమావేశంలో అన్ని కంపెనీల్లో తనిఖీలు చేసి నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించిన విషయం విదితమే. ఆయన ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సురేష్, పరిశ్రమల, కార్మికశాఖ అధికారులు కర్మాగారాల్లో తనిఖీనిర్వహించి శతశాతం స్థానికత ఉన్నట్లు శుక్రవారం కలెక్టరు చాంబర్‌లో జరిగిన సమావేశంలోని నివేది కలను అందించారు. ప్రతినెల 25లోగా ఈ మూడు శాఖలు నివేదికలు అందించాలని కలెక్టరు సూచించారు.

ప్రతి గ్రామానికి నీరందేలా చర్యలు: ఎమ్మెల్యే

తెర్లాం: ప్రతి గ్రామానికి నీరందేలా చర్యలు తీసుకున్నట్లు బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు.శుక్రవారం విజ యరాంపురంలో విలేకరులతో మాట్లాడు తూ గతపాలకుల నిర్లక్ష్యం వల్లే తోటపల్లి కాలువ మరమ్మతులకు నోచుకోలేదని, దీంతో కొన్ని వందల ఎకరాలకు నీరందక పంటలు పోయాయని తెలిపారు. రైతు లకు అండగా ఉంటానని హామీఇచ్చారు. మండలానికి రూ.ఐదు కోట్లు ఉపాధి నిధులను మంజూరుకావడంతో గ్రామా ల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలతోపాటు అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు తెలిపారు. తన సొంత నిధులు సుమారు రూ.కోటికిపైగా వెచ్చించి తోటపల్లి కాలువ లను మరమ్మతులుచేశామని చెప్పారు. అవసరమైతే ఇంకా నిధులు వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు నర్సుపల్లి వెంక టనాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగాల కార్యదర్శి వెంకటేశ్వరరావు, మండల నాయ కులు శంకరరావు, సురేష్ పాల్గొన్నారు.

వరి ఉబాలు పరిశీలన

బొబ్బిలి రూరల్: మండలంలోని కృష్ణాపురంలో రైతు స్వామినాయుడు పొలంలో ఉబాలు వేస్తున్న వరి పంట పొలాన్ని శుక్రవారం బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన పరిశీలించారు. ఈ సందర్భంగా పొలంలో ఏ రకం వరి వేశారో గ్రామ వ్యవశాయ సహాయకురాలు శ్రావణిని అడిగి తెలుసుకున్నారు. పొలంలో వరుస క్రమంలో నాట్లు వేయడం పరిశీలించి మెలకువలను వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి శంకరరావు పాల్గొన్నారు.

18 మంది హైరిస్క్ గర్భిణులు

కొత్తవలస: వియ్యంపేట పీహెచ్‌సీ పరిధిలో 18 మంది గర్భిణులను హైరిస్క్ కలిగిన వారిగా గుర్తించినట్టు వైద్యాధికారి గోపాలకృష్ణ తెలిపారు. శుక్రవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 56 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కొత్తవలసకు చెందిన సత్యసాయి సమితి సభ్యులు గర్భిణులకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జగదాంబ, పద్మావతి, హెల్త్‌అసిస్టెంట్ సత్యారావు, సాయిరాం ట్రస్టు సభ్యులు పి.రవికుమార్, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల కోసం ఎమ్మెల్యేకి వినతులు

విజయనగరం రూరల్: విజయనగరం నియోజకవర్గంలోని పలువురు టీడీపీ నాయకులు ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు నామినేటెడ్ పదవుల కోసం వినతిప త్రాలు అందజేస్తున్నారు.తమ సీనియార్టీని పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్నారు. నియోజకవర్గానికి సంబంధించి ఏఎంసీ పాలకవర్గం, పైడిమాంబ, మన్నార్ రాజగోపాలస్వామి ఆలయాలతోపాటు, మరో పది వరకూ వివిధ ఆలయాలకు ధర్మకర్తల మండళ్లు నియమించాల్సిఉంది. ఏఎంసీ ఛైర్మన్ పదవి కోసం గాజులరేగకు చెందిన నడిపిల్లి రవికుమార్, కర్రోతునర్సింగరావు, ఆల్తి బంగారుబాబు, జొన్నవలసకు చెందిన మార్తి నారాయణప్పడు తదితరులు తమ పేర్లను పరిశీలించాలని విన్నవించారు. డైరెక్టర్ల పదవుల కోసం కూడా పలువురు వినతులు సమర్పించారు. పైడిమాంబ దేవ స్థానానికి సంబంధించి ట్రస్టు బోర్డు సభ్యుల కోసం కూడా ఎమ్మెల్యే అదితి గజపతి రాజుకు దాసన్నపేటకి చెందిన కాగిత శ్రీనివాస్‌యాదవ్, ఇప్పిలి అప్పలకొండ, హు కుంపేట ప్రాంతం నుంచి కామేష్, రైల్వే స్టేషన్ ఏరియా, మూడు లాంతర్లు ప్రాంతం నుంచి కూడా పలువురు తమ, తమ పేర్లను పరిశీలించాలని కోరుతున్నారు.

చెరకు దిగుబడికి పంచసూత్రాలు కీలకం

రేగిడి: చెరకు సాగులో అత్యధిక దిగుబడి సాధనకు రైతులు పంచసూత్రాలు పాటించాలని రీసెర్చ్ అండ్ డవలప్‌మెంట్ హెడ్ షణ్ముఖసుందరం, ఆర్‌అండ్ మేనేజర్ రామచంద్రన్, ఇఐడీప్యారీ డీజీఎం కేన్ రమేష్ తెలిపారు. శుక్రవారం సంకిలి ఈఐడీ ప్యారీ సుగర్స్ ఆధ్వర్యంలో ఉంగరాడమెట్ట చెరకు ప్రాంతీయ కార్యాలయంలో చెరకుసాగు, అధిక దిగుబడులపై రైతులతో సమావేశం నిర్వహించారు. సకాలంలో ఎరువుల యాజమాన్య పద్ధతులు, కలుపు నివారణ, దూరపుచాళ్లపద్ధతి, విత్తన ఎంపిక, సుక్ష్మపోషకాలు వినియోగం ద్వారా అధికదిగుబడులు సాధ్యమని రైతులకు వివరించారు. కార్యక్రమంలో కేన్‌మేనేజర్లు కమల్‌పట్నాయక్, మురళి, డివిజన్ ఇన్‌చార్జి అశోక్, క్షేత్రస్థాయి సిబ్బందితోపాటు రైతులు పాల్గొన్నారు.

షుగర్ కేన్ గ్రోయర్స్ సొసైటీ పాలకవర్గ ఎన్నిక

బొబ్బిలి: ది బొబ్బిలి షుగర్ కేన్ గ్రోయర్స్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా సబ్బాన శ్రీనివాసరావు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్‌చైర్మన్‌గా బేతన పల్లి సత్యం, కార్యదర్శిగా యాళ్ల శ్రీనివాసరావు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పి. సత్య నారాయణ తెలిపారు. పాలకవర్గ సభ్యులుగా బలగ శ్రీనివాసరావు, బేతన పల్లి నగి రేశు, బొన్నాడ శ్రీరాములు, వంగపండు శ్రీరాములు నాయుడు, వజ్జి లక్ష్మణరావు,సాలా హరిగోపాలరావు ఎన్నికయ్యారు. వీరికీ ధ్రువీకరణపత్రాలను అందజేసిన అనం తరం ఎన్నికల అధికారి సత్యనారాయణ ప్రమాణస్వీకారం చేయించారు.

ఆదివాసీల అభివృద్ధికి కృషి చేయండి

వేపాడ: ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలని పలువురు వక్తలు డిమాండ్‌చేశారు. వేపాడలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం గిరిజన నేతలు ఆదివాసీ దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మండల ఆదివాసీ సంఘ అధ్యక్షుడు వంతు గౌరునాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో దళిత నాయకుడు కుంచి కోటేశ్వరరావు, కొప్పల అప్పారావు,మాలమహానాడు, గిరిజన నాయకులు దేబారిక కిరణ్, బంగారయ్య, కొప్పల నరసింహమూర్తి, సన్యాసిరావు, దేబారిక రవి, దేబారిక అప్పారావు, ఉగ్గిన ఈశ్వరరావు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాల పరిశీలన

రాజాం: చెత్తసంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శలకు నిర్వహించిన రెండో రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ఈసందర్భంగా సోపేరు, కొఠారిపురంల్లో చెత్తసంపద కేంద్రాలు సర్పంచ్ లు, కార్యదర్శులకు పరిశీలించారు. కార్యక్రమంలో లక్ష్మణరావు పాల్గొన్నారు.

రేగిడి: పంచాయతీల్లో చెత్తసంపద కేంద్రాల నిర్వహణ వల్ల సేంద్రియ ఎరువు తయారీతోపాటు, పారిశుధ్య నిర్వహణ మెరుగుపుతుందని ఈవోపీఆర్డీ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక మండలపరిషత్‌కార్యాలయంలో రెండోరోజు సర్పంచ్, కార్యదర్శులకు శిక్షణలో భాగంగా అమదాలవలస ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని సందర్శించారు. సత్యనారాయణతోపాటు రిసోర్స్‌పర్సన్లు గోపి, హేమసుందరావు, రాజేంద్ర పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు నిర్వహణ, శానిటేషన్ సర్పంచ్, ఎంపీటీసీల బాధ్యతను వివరించారు.

వీఆర్వోలు అందుబాటులో ఉండాలి

బొబ్బిలి రూరల్: వీఆర్వోలు ప్రజలకు నిత్యం అందుబాటులోఉండాలని తహసీల్దార్ ఎం.శీను తెలిపారు. శుక్రవ్రారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సేవలు ప్రజలకు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణను విరమించకపోతే ఉద్యమం

శృంగవరపుకోట రూరల్: సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో తలపెట్టిన ఎస్‌సీ వర్గీకరణయోచనను విరమించాలని...లేనిపక్షంలోదేశవ్యాప్త ఉద్యమానికి శ్రీకారంచుడతామని జిల్లా జైభీమ్ షెడ్యూల్ కాస్ట్ అండ్ ట్రైబ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బసవ సూర్యనారాయణ డిమాండ్‌చేశారు. ధర్మవరం అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిర్వహించిన నిరసన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సన్యాసయ్య, సంఘ జిల్లా ప్రధానకార్యదర్శి సొంగ కృష్ణారావు, రిటైర్డ్‌తహసీల్దార్ వజ్రపు సన్యాసప్పడు, ఐనాడ దేముడు, డోల కేశవ, లోతేటి కనకమ్మ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ తప్పనిసరిగా ఉండాలి

రాజాం: ప్రతి మండలంలో తప్పని సరిగ్గా ఓపెన్ స్కూల్ ఏర్పాటు చేయాలని డిప్యూటీ డీఈవో కె వెంకటరమణ సూచించారు. శుక్రవారం రాజాం ప్రభుత్వోన్నత పాఠశాలలో బ్రోచర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ టి.సన్యాసి రాజు, ఎంఈవోలు జిల్లా హెచ్‌ఎం సంఘం డీసీపీ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు,

దూరవిద్య కేంద్రం ప్రారంభం

వంగర: వంగర జడ్పీపాఠశాలలో శుక్రవారం వైజ్ఞానిక దూరవిద్య కేంద్రం పారం భించారు. అనంతరం గోడపత్రికను చీపురుపల్లి డిప్యూటీడీఈవో రమణయ్య ఆవి ష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ రమణ, ఎంఈవో దుర్గారావు, హెచ్‌ఎం రమణమ్మ పాల్గొన్నారు.

12 నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

కొత్తవలస: మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు మూడు రోజుల పాటు వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీఓ రమణయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్‌లు, కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు

విజయనగరంక్రైం: టూటౌన్‌స్టేషన్ పరిధిలో అసాం ఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్‌సీఐ టి.శ్రీనివాసరావు హెచ్చరిం చారు. శుక్రవారం టూటౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ రాత్రిపూట గస్తీ ముమ్మరం చేస్తా మని, గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నివారణకు తనిఖీ నిర్వహిస్తామన్నారు. రాత్రి పూట యువత అనవసరంగా తిరగొద్దని హెచ్చరించారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడికి నిరసన

విజయనగరందాసన్నపేట: విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై దాడికి పాల్పడిన వ్యక్తుల పై చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ రైట్స్ ఫోరం ప్రతినిధి బొంగా భానుమూర్తి కోరారు. ఈమేరకు శుక్ర వారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై కూటమి ప్రభుత్వం సమగ్ర విచా రణకు ఆదేశాలుజారీ చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో రాజ్‌కుమార్, గణేష్ పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించొద్దు

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం: ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తూ వ్యాపారాలు సాగిస్తున్న వారి చేపల చెరువులను తక్షణమే సీజ్ చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. పిడిశీల గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా చేపల పెంపకం సాగిస్తున్నట్టు జిల్లా మత్స్యశాఖ అధికారులకు శుక్రవారం ఫిర్యాదు అందింది. డిప్యూటీ డైరెక్టర్ నిర్మలా కుమారి గ్రామానికి వెళ్లి చెరువులను పరిశీలించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమించడం తో పాటు వ్యర్థాలు చెరువుల్లో వేయడం వల్ల గ్రామస్థులు వ్యాధుల భారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లైసెన్స్ రద్దు చేసి చెరువులను సీజ్ చేయాలని, శాఖా పరంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.వి.వి. గోపాలరాజు, మాజీ జెడ్పీటీసీ మక్కువ శ్రీధర్, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వండానిపేటలో జ్వరాలు



జ్వర పీడితుడు సన్యాసినాయుడు

రేగిడి: మండలంలోని వండానిపేటను విష జ్వరాలతో పలువురు మంచం పట్టారు. వారంరోజులుగా ప్రతి ఇంటా జ్వరపీడుతులు కనిపిస్తున్నారు. కొంతమంది రాజాం, పాలకొండలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సపొంది డిశ్చార్జి అవుతున్నారు. ప్రస్తుతం పొగిరి సన్యాసినాయుడు, ముగడ శంకర్, చల్ల సందీప్, కొడదాటి చిన్నోడు తదితరులు జ్వారాలతో బాధపడుతున్నారు. వీరంతా స్థానిక వైద్యసిబ్బంది పర్యవేక్షణలో వైద్యసేవలు పొందుతున్నారు.గ్రామంలో పలు వీధుల రక్షిత పైప్‌లైన్లు డ్రైనేజ్ గుండా వెళ్లడంతో తాగు నీరు కలుషితమయ్యేప్రమాదం ఉండొచ్చని, శానిటేషన్‌లోపం వల్ల దోమలు విజృంభిస్తున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. తక్షణమే ప్రత్యేకవైద్యశిబిరం నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

పీడీఎస్ బియ్యం సీజ్

చీపురుపల్లి: మండలంలోని మెట్లపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వచేసిన 690 కిలోల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. శుక్రవారం తమకు అందిన సమాచారం మేరకు దాడులు చేపట్టారు. అక్రమంగా నిల్వ చేసిన బియ్యాన్ని గుర్తించి, సీజ్ చేశారు. ఈ మేరకు సత్యవరపు ఈశ్వరరావు, సత్యవరపు భాస్కరరావులపై 6ఏ కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారులతో బాటు సీఎస్‌డీటీ పి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

రేడియాలజీ అధునాతన అనువర్తనాలపై అవగాహన

నెల్లిమర్ల: స్థానిక సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఆరోగ్య రంగంలో రేడియాలజీ అధునాతన అనువర్తనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయ మెడికల్ చీఫ్ టెక్నాలజిస్టు జె.శ్రీనివాసరావు పాల్గొని, ఆధునిక వైద్యంలో రేడియాలజీ ఉపయోగం, అధునాతన ఇమేజింగ్ టెక్నాలజీల ప్రభావంపై వివరించారు. డీన్ ఎంఎల్ఎస్ ఆచార్యులు, రేడియాలజీ విద్యార్థులు పాల్గొన్నారు. ● సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో మెకానికల్ ఇంజినీరింగ్, సీఎస్ఈ విద్యార్థులకు సమాజంలో డ్రోన్ల వల్ల కలిగే ప్రయోజనాలపై సూపర్బ్ ఎరోనాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ డ్రోన్ టెక్నాలజీ హెడ్ పి.నాగప్రవీణ్ వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్ పీఎస్‌వీ రమణరావు, విభాగాధిపతి డా.ఎస్‌వీఎస్‌కే దీపక్‌కుమార్, ప్రోజెక్టు అసోసియేట్ ఆర్.సూర్యతేజ, అసోసియేట్ ప్రొఫెసర్ డా.సుబ్రత్‌కుమార్ పరిడా, కురిటి జోగినాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

బొండపల్లి: ప్రతి వ్యక్తి భారత రాజ్యాంగం కల్పించిన సాధారణ హక్కులు, చట్టాలపై అవగాహన పొందాల్సిన అవసరం ఎంతైనా ఉందని బొండపల్లి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, గజపతినగరం బార్ అసోసియేషన్ కార్యదర్శి పి.శ్రీను తెలిపారు. దేవుపల్లి పంచాయతీ మధుర గిరిజన గ్రామమైన కొండవానిపాలెంలో గజపతినగరం మున్సిఫ్ మెజిస్ట్రేట్ బి.కనకలక్ష్మి ఆదేశాల మేరకు శుక్రవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. వితంతు మహిళలకు, దివ్యాంగులకు ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం దేవుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఆకెళ్ల శర్మిష్ట 28 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాపాక సాయిసురేష్, జి.సూర్యనారాయణ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఈవో అప్పలనాయుడు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తికి సన్మానం



హైకోర్టు జడ్జి జస్టిస్ దుర్గాప్రసాదరావు దంపతులను సత్కరిస్తున్న న్యాయవాదులు

బొబ్బిలి: బొబ్బిలి ప్రాంతానికి చెందిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు ఈనెల 11న పదవీ విమరణ చేయనుండడంతో శుక్రవారం పలువురు బొబ్బిలి న్యాయవాదులు సన్మానించారు. ఈ మేరకు అమరావతిలో బొబ్బిలి బార్ అసోసియేషన్ తరపున న్యాయవాదులు జాగారపు శ్రీనివాసరావు, ప్రసాదరావు, గంటి గోపాలకృష్ణశర్మ, దాసరి అప్పలరాజు, రుంకాన ప్రసాద్ తదితరులు హాజరై దుర్గాప్రసాదరావు దంపతులను సత్కరించారు.

దళితులను విడదీస్తే పోరాటాలు తప్పవు

గరివిడి: దళితులను విడదీస్తే పోరాటాలు తప్పవని మండల మాల మహానాడు ప్రతినిధులు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును వారు తప్పు పట్టారు. త్వరలోనే మండలంలోగల ప్రతి గ్రామంలోనూ పర్యటించి దళితుల ఐక్యతపై వివరిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు టి.సంజీవి, పి.చంద్రరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లావాదేవీలు జరగకుండా చర్య తీసుకోండి

శృంగవరపుకోట: శృంగవరపుకోటలోని ఓ లేఅవుట్‌కు హైకోర్టు స్టేటస్‌కో ఇవ్వడంతో అందులో లావాదేవీలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్.కోటకు చెందిన హనుమాన్‌శెట్టి సన్యాసిశెటి కోరారు. ఈ మేరకు తహసీల్దార్ అరుణకుమారికి శుక్రవారం వినతిపత్రం అందించారు.

రుచికరమైన భోజనం పెట్టండి

తెర్లాం: పరిశుభ్రమైన వాతావరణంలో రుచికరంగా విద్యార్థులకు వండిపెట్టాలని నిర్వాహకులకు ఎంఈవో త్రినాథరావు సూచించారు. శుక్రవారం కుమ్మరిపేట ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు, రన్నింగ్‌వాటర్‌తోపాటు మౌలిక సదుపాయాలు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు.

మోడల్ స్కూల్ పరిశీలన

కొత్తవలస: అర్జానపాలెంలోని మోడల్ స్కూల్‌ను ఆర్‌జేడీ ఉదయ్‌భాస్కర్ గురువారం పరిశీలించారు. బోధన ఎలా ఉందనే విషయాన్ని అడిగితెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. ఆర్‌జేడీ వెంట ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు జీవ వైవిధ్యంపై పోటీలు

బొబ్బిలి: బొబ్బిలి విద్యాశాఖ డివిజన్ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం జీవవైవిధ్య సంరక్షణ-యువత పాత్రఅన్న అంశంపై వక్తృత్వం, డిబేట్, షార్టు ఫిలిమ్‌పోటీలను నిర్వహించారు. బొబ్బిలిలో డిప్యూటీ డీఈవో కె.మోహనరావు ఆధ్వర్యంలో జరిగిన పోటీ ల్లో పెంట, బాడంగి, రేజేరు, కలువరాయి జడ్పీ ఉన్నత పాఠశాలలవిద్యార్థులు, కొరపుకొత్తవలస ఎంపీపీఎస్, షికా రుగంజి ఏపీఎంఎస్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వారికి మోహనరావు బహుమతులను అందజేశారు. ఈనెల 12నవిజయనగరం కస్పాహైస్కూల్‌లో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో విజేతలు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో తెర్లాం జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఎస్ఎస్ ఎం రమేష్, ఐఎస్‌వీ ప్రసాద్, కె.సింహాచలం పాల్గొన్నారు.

ఆలయాలకు శ్రావణ శోభ

● శ్రావణ శుక్రవారం పూజలు ప్రారంభం
● భక్తులతో కిటకిటలాడిన జిల్లాలోని ఆలయాలు
● ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు

జిల్లా అంతటా శ్రావణ శోభ సంతరించుకుంది. తొలి శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లాలోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు ఉదయాన్నే పెద్దసంఖ్యలో ఆలయాల వద్ద బారులు తీరారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. ఈసందర్భంగా అర్చకులు అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు.
(ఆంధ్రజ్యోతి బృందం)



రాజాం రూరల్: రాజాంలోని గాయత్రీ ధ్యానమందిరంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు



శృంగవరపుకోట: శాకంబరి దేవిగా దుర్గాదేవి



రామభద్రపురం: సాయినగర్ కనకదుర్గాదేవి ఆలయంలో..



బొబ్బిలి: బంగారమ్మ ఆలయంలో



బొబ్బిలి: శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో..



నెల్లిమర్ల: రామతీర్థంలో మహాలక్ష్మి అమ్మవారికి పూజలు

సమస్యలన్నీ పరిష్కరించాలి

● ఎమ్మెల్యే నాగమాధవి, జడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు
● మండల సర్వసభ్య సమావేశం

భోగాపురం: మళ్లీ నిర్వహించే సమావేశం నాటికి సమస్యలన్నీ పరిష్కారం కావాలని ఎమ్మెల్యే నాగమాధవి, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు.. అధికారులకు ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో సమావేశ భవనంలో ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామాల్లో లోటల్టేజీ సమస్య ఉందని చెప్పారు. అలాగే గృహాలపై నుంచి ఉన్న కండక్టర్ వైర్లను మార్చాలని కోరారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా రహదారులను తవ్వి వదిలేశారని, టేప్‌లు వేసినా నీరు సరఫరా కావడం లేదని, చాలా గ్రామాల్లో కొళాయిలు కూడా ఏర్పాటు చేయలేదని వివరించారు. అలాగే ఎయిర్‌పోర్టు ఏర్పాటులో భాగంగా నిర్వాసితులకు పలువురికి గృహాలు మంజూరు చేశారని, అర్హులకు మంజూరు చేయలేదని తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతి స్వామి మాట్లాడుతూ మండలంలో 63 లెప్రసీ అనుమానిత కేసులు ఉన్నాయని తెలిపారు. అనంతరం ఎంపీపీ అనూషారెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి అందరూ సహకరించాలన్నారు. అనంతరం జడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడారు. మండలంలో అన్ని రకాల అభివృద్ధి పనులకు జిల్లా పరిషత్ నుంచి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాగమాధవి మాట్లాడుతూ కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.



మండల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగమాధవి, జడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీపీ అనూషరెడ్డి

పరిశ్రమలు తీసుకురావాలంటే ఇక్కడ భూ ధరలు పెరిగిపోయాయని తెలిపారు. పర్యాటక ఆదాయం పెరిగేలా చర్యలు చేపడతామని చెప్పారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. సమావేశం ఆలస్యంగా ప్రారంభించడంతో చాలా శాఖలు చర్చించకుండానే సమావేశం ముగించేశారని సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు పడాల మంజులత, మండల ప్రత్యేక అధికారి సుధారాణి, ఎంపీడీవో జి.చంద్రకళ, తహసీల్దార్ ఎం.సురేష్, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో గర్భిణులకు భోజన సదుపాయం

బొబ్బిలి రూరల్: బొబ్బిలి ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం సత్యసాయి సమితి కన్వీనర్ బి.లక్ష్మణ్ ఆధ్వర్యంలో వంద మంది గర్భిణులు, వారి బంధువులకు భోజనం ఏర్పాటుచేశారు. ప్రతి నెలా తొమ్మిదో తేదీన తనిఖీ కోసం వస్తున్న గర్భిణులు, వారి బంధువుల కోసం బొబ్బిలి సత్యసాయి సమితి ఆధ్వర్యంలో ఉచితంగా భోజన సదుపాయం కల్పిస్తున్న విషయం విదితమే. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు సీహెచ్ అప్పలనాయుడు, సేవా సమితి కార్యకర్తలు పాల్గొన్నారు. ● **రేగిడి:** రేగిడి పీహెచ్‌సీలో గురువారం గర్భిణులకు నారాయణ సేవ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సత్యసాయిసేవా కమిటీ ఆధ్వర్యంలో పీహెచ్‌సీకి వచ్చిన వంద మంది గర్భిణులు, సాధారణ రోగులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది మామిడి అనంద్‌నాయుడు, వైద్యాధికారి అశిరినాయుడు, సత్యసాయి రాజాం జోనల్ కన్వీనర్ కరణం రామకృష్ణ, లావేటి విష్ణుమూర్తి, మామిడి శివప్రసాద్ పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలి

దత్తిరాజేరు: కోరపుకొత్తవలస పీహెచ్‌సీ పరిధిలో వైద్యురాలు పి.స్రవంతి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ కింద గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 34 మంది గర్భిణులకు రక్తపరీక్షలు చేశారు. ఎస్.చింతలవలస సాయిభక్తులు పద్మావతి, భాస్కరరావుల ఆధ్వర్యంలో గర్భిణులకు భోజనాలను సమకూర్చారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో బి.మురళి, ఆరోగ్య పర్యవేక్షకులు కె.రత్నమ్మ, ఆర్. శ్రీనివాసరావు, సీహెచ్‌వో, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



దత్తిరాజేరు: గర్భిణులకు తనిఖీలు చేస్తున్న వైద్యురాలు స్రవంతి

విద్యార్థుల విషయంలో రాజకీయం తగదు

గజపతినగరం: విద్యార్థుల విషయంలో రాజకీయం చేయడం తగదని కెంగువ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కెంగువ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువా రం నిర్వహించిన ఎస్ఎంసీ ఎన్నికలు కోరం లేక వాయిదా పడిన విషయం తెలిసిందే. గత ఏడాది కూడా కోరం లేక ఎన్నికలు వాయిదా పడడంతో అప్పట్లో నాడు-నేడు నిధులు నిలిచిపోయాయి. ఈనేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ గత ఏడాది గ్రామంలో బెల్టుషాపు ద్వారా మద్యం అమ్మకాలకు ఇరుపార్టీలు సమ్మతిపై రూ.లక్షల్లో వసూలు చేశారని.. చంపావతి నదిలో నుంచి ఇసుకకు రూ.లక్షల్లో పాట నిర్వహించారని ఆరోపిస్తున్నారు. విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని రాజకీయాలు పక్కన పెట్టి ఎన్నికలు సక్రమంగా జరిగేలా సహకరించాలని వారు కోరుతున్నారు.

జేఎన్‌టీయూలో 'స్వచ్ఛభారత్'

విజయనగరం రూరల్: జేఎన్‌టీయూ జీవీలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనివర్సిటీ ప్రాంగ ణం, హాస్టల్ పరిసరాలు, అకాడమిక్ బ్లాక్-1, కళాశాల ఆవరణలో కలుపు మొక్కలను తీసివేసి, పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. ఎన్ఎస్ఎస్ విభాగాన్ని వీసీ రాజ్యలక్ష్మి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీకుమార్, వైస్ ప్రిన్సిపాల్ నాగ రాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

గిరిజన విశ్వవిద్యాలయంలో ఆదివాసీ దినోత్సవం



నృత్యం చేస్తున్న గిరిజన విద్యార్థులు

విజయనగరం రూరల్: విజయనగరంలోని కేంద్రియ గిరిజన విశ్వవిద్యాలయంలో ఆదివాసీ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్త, సెంచరీ గ్రూప్ ఆఫ్ బిజినేస్ సీఈఓ ధరణి మాట్లాడుతూ. గిరిజనులు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలన్నారు. గిరిజన విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల డీన్ ముక్కాముల శరత్‌చంద్ర, యూనివర్సిటీ రిజిస్ట్రార్ టి.శ్రీనివాసన్, కార్యక్రమ చైర్మన్ డాకర్ అనిరుధ్ కుమార్, పి.శ్రీదేవి, బొంతు కోటయ్య, ప్రమా, వెంకటేశ్వర్లు, ఎన్‌వీఎస్ సూర్యనారాయణ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరలేదు'

మెంటాడ: ఆండ్ర అంగన్‌వాడీ కేంద్రాన్ని గజపతినగరం ఐసీడీఎస్ సీడీపీవో నాగమణి శుక్రవారం సందర్శించారు. కేంద్రం పరిస్థితిని పరిశీలించారు. పనితీరుపై విద్యార్థుల తల్లులను ఆరా తీశారు. కేంద్రాన్ని నిర్వహిస్తున్న భవనం స్లాబు బీటలు వారిందని, పెచ్చులూడుతున్నా యని, పాములు సంచరిస్తున్నాయని సామాజిక మధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో స్వయంగా తాను పరిశీలించానని, అటువంటివేవీ లేవని నాగమణి తెలిపారు. చిన్న చిన్న లోపాలు ఉంటే సరిచేస్తానని చెప్పారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

గజపతినగరం: క్విట్ ఇండియా స్ఫూర్తితో మద్యం, గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి కోరారు. శుక్రవారం క్విట్ ఇండియా డేని పురస్కరించుకొని పురిటిపెంట గ్రామంలో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఐద్వా కార్యదర్శి హరికృష్ణవేణి, రత్నసాగరి, నగర పైడమ్మ తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబను దర్శించుకున్న రామచంద్ర యాదవ్

విజయనగరం రూరల్: విజయనగరంలోని పైడిమాంబ, మన్నార్ రాజగోపాలస్వామి ఆలయాల్లో భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) జాతీయ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనకు ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో బీసీవై నాయకులు, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్పంచ్‌ల శిక్షణ

నెల్లిమర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు జరుగుతున్న శిక్షణా కార్యక్రమం రెండో రోజు శుక్రవారం కూడా కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.రామారావుతో పాటు మాస్టర్ ట్రయినీలు యడ్ల రమణ, యర్ర రమణ తదితరులు పలు సంక్షేమ పథకాల అమలు, గ్రామ పరిపాలన అంశాలపై సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె.సింహాద్రి పాల్గొన్నారు.

ముగిసిన సంతోషిమాత విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో గత మూడురోజులుగా జరుగుతున్న సంతోషిమాత బింబ, శిఖరాలయ ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఉదయం 6.45 గంటలకు గవ్యాంత పూజలు, రత్నన్యాసం, గర్తన్యాసం, యంత్ర ప్రతిష్ఠాపన, మూర్తి స్థాపన, కళాన్యాసములు, అంగహోమాలు, పూర్ణాహుతి, ధేనుదృష్టి, బ్రాహ్మణ దర్శనాలను వేద పండితులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రజాదర్శనానికి అనుమతిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

కళాను కలిసిన రైస్ మిల్లర్స్ ప్రతినిధులు

గరివిడి: జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బలగం వెంకట్రావు ఆధ్వర్యంలో మిల్లర్స్ ప్రతినిధులు శుక్రవారం చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావును ఆయన గృహంలో కలిసారు. ఈసందర్భంగా వెంకట్రావు జిల్లాలో రైస్ మిల్లర్స్ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా రైస్ మిల్లర్స్ ప్రతినిధులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను మంజూరు చేయించాలని ఆయనను కోరారు.

క్లుప్తంగా..

సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

విజయనగరంక్రైం: జిల్లా పోలీసుశాఖలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించారు. ఒక్కక్కరితో సమావేశమై, వారి వ్యక్తిగత, వృత్తిపరమైన సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు చేపడతానన్నారు. శాఖపరమైన క్రమశిక్షణ చర్యలు నిలిపివేయాలని కోరుతూ వచ్చినవే ప్రధానంగా ఉన్నాయని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ నర్సింహమూర్తి పాల్గొన్నారు.

కెంబూరి మృతి తీరని లోటు

విజయనగరం రూరల్: మాజీ ఎంపీ కెంబూరి రామ్మోహనరావు మృతి రాజకీయ రంగానికి తీరని లోటని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీపురుపల్లి ఎమ్మెల్యేగా, బొబ్బిలి ఎంపీగా బాధ్యతలు నిర్వహించి, జిల్లాలోని పలు సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు.

సీఐగా జీవీ రమణ బాధ్యతల స్వీకరణ

గజపతినగరం: స్థానిక సర్కిల్ పోలీస్ స్టేషన్ సీఐగా జీవీ రమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించా రు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ ఎన్‌వీ ప్రభాకరరావుకు విశాఖపట్నానికి బదిలీ అయింది. విజయనగరం ఏసీబీలో విధులు నిర్వహించిన సీఐ రమణ గజపతినగరం వచ్చారు.

కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు

శృంగవరపుకోట రూరల్: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వానికి జిల్లా బ్రాహ్మణ పురోహిత సమాఖ్య ధన్యవాదాలు తెలియజేసింది. శుక్రవారం సంఘ జిల్లా కార్యదర్శి దొంతుకూర్తి సాయికుమార్ శర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణ కుటుంబాల కోసం ఈ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అమోఘమన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

విజయనగరం రూరల్: రాష్ట్రంలోని దూప, దీప, నైవేద్యాలకు నోచుకోని ఆలయాలకు రూ.10వేలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంపై టీడీపీ బ్రాహ్మణ విభాగం నాయకుడు డాక్టరు పేరి రామయ్య పంతులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. బ్రాహ్మణ సామాజిక అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యమని పేర్కొన్నారు.

రైసుమిల్లర్ల కోశాధికారిగా లక్ష్మణరావు

రాజాం: జిల్లా రైసుమిల్లర్ల కోశాధికారిగా రాజాంకు చెందిన టీడీపీ నాయకుడు పొట్నూరు లక్ష్మణరావు ఎన్నికయ్యారు. శుక్రవారం జిల్లా రైసు మిల్లర్ల అధ్యక్షుడు బలగ వెంకటరావు, కార్యవర్గ సభ్యులను సత్కరించా రు. లక్ష్మణరావును ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పలువురు నాయకులు, అధికారులు అభినందించారు.